## క్లుప్తంగా

### వైఎస్ జగన్‌ను కలిసిన ఖాజా



పెడన: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెడన పురపాలక సంఘం వైస్‌చైర్మన్ ఎండీ ఖాజా మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి జోగి రమేష్‌తో కలిసి బుధవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం జగన్‌ను కలిశారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని మాజీ సీఎం జగన్ సూచించినట్లు ఖాజా వివరించారు.

### ముగిసిన బ్రహ్మోత్సవాలు

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయ పండితులు దీవి వెంకట రామాశ్రీనివా సాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామి వారికి నిత్యహోమం, పూర్ణాబలి, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణకర్తలు పోతరాజు పవన్‌కుమార్ సమిత్ర దంపతులు పలు రకాల ద్రవ్యాలతో పూర్ణాహుతి జరిపించారు. ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ: ప్రసిద్ధ కాళేశ్వరం పుణ్యక్షేత్రం వద్ద ఈనెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ నిర్వహించనున్న సరస్వతి నది పుష్కరాలకు అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు నడపనున్నట్టు డీఎం హనుమంతరావు బుధవారం తెలిపారు. ఈనెల 21వ తేదీన రాత్రికి 8 గంటలకు అవనిగడ్డలో బయలుదేరే ఈ బస్సు మరుసటిరోజు ఉదయానికి కాళేశ్వరం చేరుకుంటుందన్నారు. అనంతరం రామప్ప దేవాలయం, వరంగల్‌లో వెయ్యి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయం సందర్శించుకుని ఈనెల 23వ తేదీన అక్కడ నుంచి తిరిగి బయలుదేరుతుందన్నారు. బస్ చార్జీ ఒకరికి రూ.2వేలుగా నిర్ణయించి చెప్పారు. ప్రజలు ఓ గ్రూపుగా ఏర్పడితే ఆ గ్రామం నుంచి బస్సు సర్వీసుని నడుపుతామని తెలిపారు.

### బస్ షెల్టర్ ప్రారంభం



ఘంటసాల: ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం కరకట్టపై కొండవీటి పాండురంగరావు–సీతారామమ్మ జ్ఞాపకార్థం వారి మనుమడు సుగ్గుణ సురేంద్రకుమార్–మాధవి దంపతులు రూ.3లక్షలతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో యువనేత మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) జనసేన ఉపాధ్యక్షులు సుగ్గుణ పవన్‌కుమార్, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### విద్యార్థి మిత్ర కిట్ల పరిశీలన



చిలకలపూడి(మచిలీపట్నం): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్(ఏపీసీ) కుముదిని సింగ్ బుధవారం పరిశీలించారు. స్థానిక చిలకలపూడిలోని పాండురంగ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఆమె ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ తదితర మెటీరియల్‌ను పరిశీలించారు. అనంతరం పీఎంశ్రీ స్కూల్ గ్రౌండ్, కెమిస్ట్రీ ల్యాబరేటరీ, కిచెన్ షెడ్డు పనులను కూడా పరిశీలించారు. ఈకార్యక్రమంలో సమగ్ర శిక్షా సీఎంఓ రమేష్, ఏఎంఓ శ్యామ్, ఐఈ కోఆర్డినేటర్ రాంబాబు, ఏపీఓ ఏడుకొండలు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆటలు పోటీలు



మచిలీపట్నంటౌన్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక పోర్టు రోడ్డులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు బుధవారం ఆటలపోటీలు నిర్వహించారు. శిబిరానికి 58 మంది విద్యార్థులు హాజరుకాగా లెమన్ స్పూన్, ఖోఖో తదితర ఆటలు ఆడించారు. స్పోకెన్ ఇంగ్లిష్ బోధించారు. విద్యార్థులు నేటి సమాజంలో ఎలా వ్యవహరించాలి అనే విషయాలను జిల్లా గ్రంథాలయ సంస్థ ఇంచార్జి కార్యదర్శి నగేష్ వివరించారు.

# పామాయిల్ సాగుపై రైతుల ఆసక్తి

- 50 ఎకరాల్లో పామాయిల్ సాగు
- మరో 50 ఎకరాల్లో సాగుకు ఆసక్తి



బొబ్బర్లంక: పామాయిల్ తోటలో అంతర పంటలుగా సాగుచేసిన మిర్చి, మునగ

మోపిదేవి: మండలంలోని ఆయా గ్రామాల రైతులు పామాయిల్ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. కృష్ణా నది వరదలు, కూలీల కొరత సమస్యలను అధిగమించేందుకు అవకాశం ఉండటంతోపాటు ఒక్కసారి మొక్క నాటితే సుమారు 30 ఏళ్లపాటు దిగుబడి వస్తుండటంతో పామాయిల్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. నీరు నిల్వ ఉండని మాగాణి భూములు కూడా పామాయిల్ సాగుకు అనుకూలమని రైతులు చెబుతున్నారు.

**లంక ప్రాంత రైతుల ఆసక్తి..**

కృష్ణానదికి తరచూ వరదలు వస్తుండటంతో లంక ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే పెద్ద రైతులు భూములను కౌలుకు ఇచ్చి వ్యవసాయానికి దూరమవుతుండగా, సాగు కలిసిరాక కౌలుదారులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనికితోడు వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత అధికంగా ఉండటం కూడా రైతులకు పెద్ద సమస్యగా మారింది. ఈ క్రమంలో పామాయిల్ సాగు అయితే ఈ సమస్యలను అధిగమించవచ్చని భావిస్తూ పలువురు రైతులు ఇప్పటికే 50 ఎకరాల్లో పామాయిల్ సాగు చేపట్టారు. మరో 50 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

**నాలుగేళ్లకు దిగుబడి ప్రారంభం..**

మొక్కకు మొక్కకు మధ్య 9 మీటర్ల దూరంగా ఉండేలా ఎకరా భూమిలో సుమారు 57 పామాయిల్ మొక్కలు నాటుకోవచ్చు.తద్వారా మొక్కలకు గాలి బాగా సోకి ఎక్కువ మట్టలు విచ్చుకునే అవకాశం ఉంటుంది. నెలకు రెండు మట్టల చొప్పున మొక్క పెరగడంతో వాటికి గెలలు కూడా అధికంగా వస్తాయి. ఒక్కో పామాయిల్ మొక్కను రైతులు రూ.193 వెచ్చించి కొనుగోలు చేసి నాటుతున్నారు. మొక్క నాటిన 20నెలల తరువాత తొలిసారిగా వచ్చే గెలలను తొలగించాల్సి ఉంటుంది. పామాయిల్ సాగులో మొక్కను నాటిని నాలుగేళ్లకు దిగుబడి ప్రారంభమవుతుంది. అప్పటి వరకు పామాయిల్ సాగులో అంతర పంటలుగా మిర్చి, మునగ, టమాటా, మినుము వంటి పంటల సాగు చేపట్టవచ్చు. అంతర పంటల ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉండటంతో రైతులు ఈసాగు వైపు మొగ్గు చూపుతున్నారు.



పామాయిల్ గెలలు(ఫైల్)

**ఎకరాకి పది టన్నుల దిగుబడి...**

ఎకరా పామాయిల్ సాగుకు రూ.25వేలు వరకు పెట్టుబడి అవుతుంది. నాలుగేళ్ల తర్వాత ఎకరానికి పది టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను పామాయిల్ గెలలు ధర రూ.20,250 వరకు పలుకుతోంది. దొంగలు పట్టుకుపోతారనే భయం లేకపోవడం, మందులు, ఎరువులు వినియోగం తక్కువగా ఉండటం, ప్రకృతి వైపల్యాలను తట్టుకునేశక్తి ఉండటం కూడా పామాయిల్ సాగు వైపునకు మొగ్గుచూపినట్లు బొబ్బర్లంక, ఉత్తరచిరువోలులంక, నాగాయితిప్ప, మోపిదేవి గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు. ఇటీవల కృష్ణానది వచ్చిన వరదలకు బొబ్బర్లంక గ్రామంలో వేసిన పామాయిల్ తోట మూడు రోజులపాటు నీటిలో మునిగిపోయినా ఎటువంటి ఇబ్బంది లేకుండా పంట తిరిగి ఏపుగా పెరగడం ఈ సాగు వైపు రైతులు ఆసక్తి కనబరచడానికి మరో కారణం. ఇలా మోపిదేవి మండలంలో పామాయిల్ సాగు క్రమక్రమంగా పెరుగుతోందని చెప్పవచ్చు.

# రైతు సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే



బంటుమిల్లిలో వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి: రైతులు క్షేమంగా ఉంటే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటాయని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అందుకోసమే కూటమి ప్రభుత్వం రైతుల కోసం కృషి చేస్తోందని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సాయంతో 50 శాతం రాయితీపై మంజూరైన వ్యవసాయ పనిముట్లను స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద బుధవారం ఆయన రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సాయాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయంగా పాడి, కోళ్ల పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

త్వరలో ప్రారంభం కానున్న సార్వాలో రైతులకు కావలసిన వరి విత్తనాలు ముందుగానే సిద్ధం చేయాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. రైతులు కొని తెచ్చుకున్న తర్వాత ప్రభుత్వం విత్తనాలు వస్తే ఏమి లాభం అని పేర్కొన్నారు. ఈ పద్ధతిని మార్చుకోవాలని అధికారులను హెచ్చరించారు. బంటుమిల్లి మండలానికి మంజూరైన 16 టన్నుల పశువుల దాణా పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. పాడిపరిశ్రమను ప్రోత్సహిస్తూ 50శాతం సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఏడీ గౌతమ్ మాట్లాడుతూ బంటుమిల్లి మండలంలో 19 గ్రామ పంచాయితీలకు చెందిన 93 మంది రైతులకు రూ.17.63లక్షలు, కృత్తివెన్ను మండలంలోని 8 పంచాయితీల్లోని 35 మంది రైతులకు రూ. 8.11 లక్షల విలువ చేసే పవర్‌స్ప్రేయర్లు, రొటావేటర్లు, కల్టివేటర్లను అందజేస్తున్నట్లు వివరించారు.

కార్యక్రమంలో బంటుమిల్లి, కృత్తివెన్ను ఏఓలు జి.శివరామకృష్ణ, జెస్సీ, పశుసంవర్థక శాఖ ఇన్‌చార్జి ఏడీ బాబూరావు, వైద్యులు స్ఫూర్తి, రాజీవ్, బంటుమిల్లి డీసీ చైర్మన్ బి.కాశీ, మండల పార్టీ అధ్యక్షుడు కే.వీరబాబు, ఓడుగు తుల సీరావు బంటుమిల్లి, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కుల చరిత్రను మంత్రి వక్రీకరించడం తగదు

**పొనమాల నాగరాజు**



చల్లపల్లి: తమిళనాడులోని వన్నియ కుల క్షత్రియులు ఆంధ్రప్రదేశ్‌లో అగ్నికుల క్షత్రియులుగా పిలిపించుకుంటున్నారంటూ మంత్రి కొల్లు రవీంద్ర అగ్నికుల క్షత్రియుల కులచరిత్రను వక్రీకరించడం తగదని వైఎస్సార్ సీపీ ఆర్టీఐ విభాగం జిల్లా అధ్యక్షులు, బిసి చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొనమాల నాగరాజు పేర్కొన్నారు. ఇటీవల తమిళనాడులోని మహాబలిపురంలో జరిగిన సభలో మంత్రి ఈ మేరకు చేసిన వ్యాఖ్యలతో లక్షలాది మంది మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నట్లు బుధవారం ఆయన పేర్కొన్నారు. టీడీపీ కులాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ పదవులు కట్టబెడుతోందన్నారు. కుల గౌరవాన్ని, ఐక్యతను కాపాడే నాయకులను గుర్తించడంలో విఫలమవుతోందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు గత 40ఏళ్లలో ఏనాడూ అగ్నికుల క్షత్రియుల గురించి ఆలోచించలేదన్నారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అగ్నికుల క్షత్రియుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. భవిష్యత్తులో అగ్నికుల క్షత్రియుల గౌరవం, ఐక్యత, అభివృద్ధి కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రిని కోరారు. తమిళనాడులోని మహాబలిపురం కార్యక్రమానికి అగ్ని(వన్నియ)కుల క్షత్రియ ప్రముఖులందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నప్పటికీ చిత్తూరుకు చెందిన సిఆర్ రాజన్ తెలుగుదేశం పార్టీ నాయకులకు మాత్రమే సమాచారం అందించారని ఆరోపించారు. ఈ విషయాన్ని తాము ఖండిస్తున్నట్లు నాగరాజు తెలిపారు.

# ప్రతిభ చూపిన కేవీ విద్యార్థులు



రిహిత



హిమవర్షిణి



సుల్తానా

మచిలీపట్నం టౌన్: సీబీఎస్ఈ టెన్త్ పరీక్ష ఫలితాల్లో నగరంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ బుధవారం తెలిపారు. ఈ పరీక్షా ఫలితాల్లో కేవీ విద్యాలయానికి చెందిన కొసనం రిహిత 600మార్కులకుగాను 555 మార్కులతో ప్రథమస్థానంలో నిలువగా, కుంపటి హిమ వర్షిని 534 మార్కులతో ద్వితీయస్థానం, రాయిషా సుల్తానా 529 మార్కులతో తృతీయస్థానంలో నిలిచినట్లు వివరించారు. పరీక్షలకు హాజరైన 61మంది పాస్ కావడంతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఆరుగురు విద్యార్థులు 500పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలియజేశారు.

# ఏపీఆర్‌జేసీలో విద్యార్థుల ప్రతిభ



తిరుమాని యుగేంద్రవర్మ



అజ్మీరాహనిశ్రీ

బంటుమిల్లి: ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఏపీ ఆర్‌జేసీ–2025 పరీక్షల్లో స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ఆపాఠశాల కరస్పాండెంట్ కె.శోభ, డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన తిరుమాని యుగేంద్రవర్మ రాష్ట్రస్థాయి బైపీసీ గ్రూపులో 5వ ర్యాంకు, అజ్మీ రాహనిశ్రీ 109వ ర్యాంకు, తోట విద్యాఅమృతహర్షిణి, దున్న సురేంద్ర వరుసగా 693, 930ర్యాంకులు, ఎంపీసీలో తిరుమాని శృతిశ్రీ 418వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ప్రతిభచూపిన విద్యార్థులు, అందుకు కృషిచేసిన అధ్యాపకులకు కరస్పాండెంట్, డైరెక్టర్, హెచ్ఎం శ్రీనివాసరావు అభినందనలు తెలియజేశారు.

### సమ్మె నోటీసులు అందజేత



చల్లపల్లి: లేబర్‌కోడ్ రద్దుతోపాటు ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వతేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను కార్మికులు, ప్రజలు విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహ్మమద్ కరీముల్లా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యాలయాలకు సమ్మెకు సంబంధించి నోటీసులను బుధవారం అందజేశారు. కరీముల్లా మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు రూ.21వేలు జీతం చెల్లించాలని, టెండర్లను రద్దుచేయాలని కోరారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కనగాల ప్రసాద్, సహాయ కార్యదర్శి శాంతల జయలక్ష్మి, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

### పశుదాణా పంపిణీ ప్రారంభం




గూడూరు: పాడి పరిశ్రమ ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గూడూరు డీసీ చైర్మన్ పోతన వెంకట లక్ష్మీనరసింహస్వామి అన్నారు. గూడూరులో వెటర్నరీ డిస్పెన్సరీలో 50శాతం రాయితీపై పశుదాణా పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1110 విలువైన రూ.50 కిలోల పశు దాణాను 50శాతం సబ్సిడీపై రూ.555కే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి లింగం సులోచనారాణి, పశుసంవర్థక శాఖ ఏడీ కొనకళ్ల బాబూరావు, మాజీ సర్పంచులు పోతన రామోజీ, కట్టా మునేశ్వరరావు, గోపి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు

మోపిదేవి: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలను విద్యుత్ కోతలు మరింత ఇబ్బందిపెడుతున్నాయి. మండలంలో మోపిదేవి, పెదకళ్లేపల్లిలో రెండు సబ్ స్టేషన్లు ఉండగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ పూర్తిగా నిలిపివేయడంతో ఇళ్లలో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం కేవలం గంటపాటు మాత్రమే విద్యుత్ సరఫరా చేసి అనంతరం తొలగించిన అధికారులు, సాయంత్రం ఆరున్నర గంటల వరకు విద్యుత్ కోతను కొనసాగించడంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పొక్లెయిన్ స్వాధీనం



ఘంటసాల: అనుమతుల్లేకుండా చెరువు కట్టలు పోస్తున్న పొక్లెయిన్‌ను ఘంటసాల రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ కథనం మేరకు..ఘంటసాల మండలం చిట్టూర్పు శివారు జోడుగూడెంలో చేపల చెరువులో మట్టి తవ్వకాలు సాగుతున్నట్లు మంగళవారం రాత్రి ఫోన్ ద్వారా సమాచారం అందడంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులు కలసి జోగుడూడెం వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పొక్లెయిన్‌తో చెరువులోని గట్లను సరి చేస్తున్నట్లు గుర్తించి, పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. . ఘంటసాల మండలంలోని ఏ గ్రామంలో మట్టి తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయలేదని, అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తే చర్యలు తప్పవని మండల తహసీల్దార్ విజయ ప్రసాద్ హెచ్చరించారు.

# జగనన్నను తిరిగి సీఎం చేసుకుందాం

**మాజీమంత్రి జోగి రమేష్**



కామేశ్వరరావు ఇంటివద్ద కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీమంత్రి జోగి రమేష్

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేంత వరకు ప్రతి కార్యకర్త నిరంతరం కృషి చేయాలని మాజీమంత్రి జోగి రమేష్ పిలుపునిచ్చారు. నగరంలోని బలరామునిపేటలో ఉన్న గూడూరు మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కారుమంచి కామేశ్వరరావుకు చెందిన ఇంటిపై ఈనెల 9వతేదీన గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన నేపథ్యంలో జోగి రమేష్ బుధవారం ఆయనను కలిసి పరామర్శించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి జోగి రమేష్ మాట్లాడుతూ కారుమంచి కామేశ్వరరావుకు పార్టీ అండగా ఉంటుందన్నారు. దాడికి పాల్పడినవారిపై ఫిర్యాదు చేశామని, పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. అయితే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎటువంటి చర్యలకు పాల్పడినా తామంతా ఒక్కటిగా నిలిచి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో గూడూరు, కృత్తివెన్ను ఎంపీపీలు సంగా మధుసూదనరావు, కూనసాని గరుడప్రసాద్ (తాతాజీ), కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పిన్నెంటి మహేష్, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కుల ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


# నవధాన్యాల కిట్లు పంపిణీ



మర్రిపాలెం రైతుకేంద్రంలో పీఎండీఎస్ కిట్లు పంపిణీ చేస్తున్న వీఏఏ

నాగాయలంక: ఏపీసీఎన్ఎఫ్, వెలుగు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పలు రైతుసేవా కేంద్రాల్లో బుధవారం రైతులకు పీఎండీఎస్(ప్రీమాన్‌సూన్ డ్రై సోవింగ్) కిట్లను పంపిణీ చేశారు. ఏఓ ఏ.సంజీవరావు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ వ్యవసాయంలో తొలకరి జల్లుల అనంతరం నవధాన్యాలు చల్లుకునే ప్రక్రియతో ఏరువాక సాగిస్తే భూమిని నిత్యం సారవంతంగా ఉంటుందన్నారు. ఇందుకోసం రైతు సాధికార సంస్థ 32రకాల విత్తనాలను కలిపి రైతులకు కిట్లుగా అందిస్తున్నట్లు వివరించారు. మండలంలో 1250 కిట్‌లు లక్ష్యం కాగా 250 కిట్లు అందుబాటులో ఉన్నాయని ఇవి పూర్తి కాగానే మిగతావి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. 13కేజీల కిట్‌ను రూ.1250 ధరతో రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు.

# కోలాహలంగా అంకాల దేవర జాతర



విశేషాలంకారంలో అంకాలదేవర అమ్మవారు



నైవేద్యాలు, పొట్టేళ్లతో ఆలయానికి వస్తున్న భక్తులు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో కొలువై ఉన్న గ్రామదేవత శ్రీఅంకాల దేవర అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం బుధవారం కోలాహలంగా సాగింది. గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ఉత్సాహంగా తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత సంప్రదాయ రీతిలో అమ్మవారి గుడి సంబరాన్ని ఆచారవంతులచే ఆరంభించారు. అనంతరం భక్తులు ఊరేగింపుగా వచ్చి మొక్కుబడులు చెల్లించుకుని, తదుపరి నైవేద్యాల సమర్పించుకున్నారు.అనంతరం అంకాల దేవర జాతర సంప్రదాయంలో భాగంగా పోతురాజుస్వామి, గ్రామదేవత ఉర్వేళమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేకంగా నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. గ్రామోత్సవం జరిపారు.ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మారెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), నాగాయలంక పిఏసిఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకటసాంబశివరావు(చంటి), ముఠా పెద్దలు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# కూటమి తీరుతో పాఠశాలలకు నష్టం : ఆప్టా

మచిలీపట్నంఅర్బన్: కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు తీరని నష్టం వాటిల్లుతోందని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్షులు జి.నవీన్, ప్రధానకార్యదర్శి ఏఆర్ అస్లమ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ బడుల్లో పునర్ వ్యవస్థీకరణ, టీచర్ల సర్దుబాటుపై ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులలో ఫౌండేషన్, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి 1:30 పాటించడంతో అవి ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. భవిష్యత్‌లో ఆయా పాఠశాలలు పూర్తిగా మూతపడే అవకాశం ఉందన్నారు .ఈ విషయంపై తమ సంఘం పలుమార్లు వినతులు సమర్పించినా అధికారులు పెడచెవిన పెట్టారన్నారు. సబ్జెక్టు టీచర్లుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లను బోధన కోసం ప్రాథమికోన్నత పాఠశాలల్లో నియమించాలని, ప్రాథమిక పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను పూర్తిగా తొలగించడం ద్వారా అక్కడున్న 6, 7, 8 తరగతులు విద్యార్థులకు సబ్జెక్ట్ నిపుణుల సేవలకు ప్రభుత్వం దూరం చేసిందన్నారు. పాఠశాలలను ప్రయోగశాలలుగా చేసి విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసే చర్యలను కూటమి ప్రభుత్వం ఇకనైనా ఆపాలని డిమాండ్ చేశారు.

# ఆపరేషన్ సిందూర్ దేశానికే గర్వకారణం



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



భారీ తిరంగా ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

మోపిదేవి: ఆపరేషన్ సింధూర్ దేశానికి గర్వకారణమని ఎంపీపీ రావి దుర్గావాణి పేర్కొన్నారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో పలుశాఖల అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. వెయ్యి అడుగుల జాతీయ పతాకంతో మండల పరిషత్ కార్యాలయం నుంచి మోపిదేవి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి గుడిసెంటర్‌లో అమర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా నియోజకవర్గ యువనాయకుడు మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ భారతదేశ త్రివిధ దళాల పోరాట పటిమను కీర్తించారు. దివి మార్కెట్ యార్డు చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు, సీడీసీ మాజీ చైర్మన్ రావి నాగేశ్వరావు, రావి రత్నగిరి, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, బొబ్బర్లంక, కొక్కిలిగడ్డ గ్రామ సర్పంచులు దొప్పలపూడి గంగాభవానీ, దిడ్ల జానకీ రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు దిడ్ల రాణి, కొమ్ము పవన్, మండల కోఆప్షన్ సభ్యులు చందన రంగారావు, బాల కోటేశ్వరావు, బల్లా ప్రసాద్, కేసాని శివుడు, దుట్టా రవీంద్రనాధ్ ఠాగూర్, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.